నమస్తే తెలంగాణ

మెదక్

I | హైదరాబాద్, బుధవారం 25 జూన్ 2025 | MEDAK

సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలంలోని గుంతపల్లిలో రైతులకు ఉచితంగా యూరియా బస్తాలు అందజేస్తున్న బీఆర్ఎస్ జిల్లా నాయకుడు అనంత్‌రెడ్డి

రైతులకు ఆపన్న హస్తం

ఉచితంగా యూరియా బస్తాలు పంపిణీ చేసిన బీఆర్ఎస్ సంగారెడ్డి జిల్లా నాయకుడు అనంత్‌రెడ్డి

కొండాపూర్, జూన్ 24 : రైతులను ఆదుకునేందుకు బీఆర్ఎస్ నేత కంకణం కట్టుకున్నాడు. ప్రస్తుతం పంటల కాలం కావడంతో రైతులు ఇబ్బందులు పడొద్దని భావించి సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం గుంతపల్లికి చెందిన బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పడమటి అనంత్‌రెడ్డి 400 కుటుంబాలకు ప్రతి రైతుకు ఉచితంగా మూడు 20-20 బస్తాలు, రెండు యూరియా బస్తాలను తన సొంత డబ్బులతో పంపిణీ చేశాడు. వానకాలంలో డబ్బులు లేక రైతులు ఇబ్బందులు పడొద్దనే సంకల్పంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపాడు. రైతులు మాట్లాడుతూ పేదలను ఆదుకోవడంలో అనంత్‌రెడ్డి ముందుంటాడన్నారు. కరోనా సమయంలో ఉచితంగా నిత్యావసర సరుకులు, కూరగాయలను పంపిణీ చేశాడని గుర్తు చేశారు.

హామీల అమలులో సర్కార్ విఫలం

బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, జూన్ 24: అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో సీఎం రేవంత్‌రెడ్డి పూర్తిగా విఫలమయ్యారని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గ పరిధిలోని 40మంది లబ్ధిదారులకు కేసీఆర్ సహకారంతో మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ హక్కులను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆంధ్రా నాయకుల చేతుల్లో పెడుతుందని మండిపడ్డారు. రాష్ట్రంలో ఆంధ్రా నాయకుల పెత్తనం నడుస్తుందని, తెలంగాణ నీళ్లను దోచుకునే కుట్రలు జరుగుతున్నాయన్నారు. శ్రమించి కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించారని, అదే ప్రాజెక్టు పేరిట పబ్బం గడుపుతూ ఆంధ్రా నాయకులకు వత్తాసు పలుకుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజలను మోసం చేస్తుందన్నారు. కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను గాలికొదిలేసి ప్రజలకు నష్టంచేకూర్చుతున్నారన్నారు. గతంలో సీఎంఆర్ఎఫ్ పథకం ద్వారా గరిష్ట మొత్తాన్ని మంజూరు చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం భారీగా కోతలు విధిస్తూ నిరుపేదల పొట్టకొడుతుందన్నారు. కార్యక్రమంలో గజ్వేల్ మాజీ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నవాజ్‌మీరా, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి, నాయకులు రామచంద్రం, కనకయ్య, రవీందర్, స్వామిచారి పాల్గొన్నారు.

సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి



సంగారెడ్డి జిల్లా జిన్నారంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు మహాధర్నాలో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు (ఫైల్)

రైతుల అకౌంట్లలో
రైతు భరోసా జమ

పటాన్‌చెరు రూరల్, జూన్ 24: సమస్తే తెలంగాణ దినపత్రికలో ఈ నెల 18పతేదీన వచ్చిన పటాన్‌చెరు డివిజన్‌కు రైతు భరోసా బంద్ అనే కథనం పటాన్‌చెరు నియోజకవర్గంలో అగ్గిరాజేసింది. నాలుగు మండలాల రైతులకు రైతు భరోసా ప్రభుత్వం వేయలేదని అన్ని పార్టీలు రైతులకు జరిగిన అన్యాయాన్ని గుర్తించాయి. అధికార పార్టీ నేతలు ప్రభుత్వానికి లెటర్ రాయడం, మంత్రులకు వినతి పత్రాలు ఇచ్చారు. మాజీ మంత్రి హరీశ్‌రావు సంగారెడ్డి జిల్లా జిన్నారంలో పెద్ద ఎత్తున రైతులతో ధర్నా నిర్వహించి సర్కార్‌కు రైతు భరోసా వేయాలని, లేదంటే రింగ్‌రోడ్డును దిగ్బంధిస్తామని హెచ్చరించారు. పార్టీలకతీతంగా ఉద్యమించడంతో ప్రభుత్వం స్పందించి జరిగిన తప్పును గుర్తించింది. మంగళవారం రైతుల అకౌంట్లలో ప్రభుత్వం రైతు భరోసా డబ్బులు జమచేయడంతో మెసేజ్‌లు వచ్చాయి. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పటాన్‌చెరు డివిజన్‌లోని జిన్నారం, పటాన్‌చెరు, రామచంద్రాపురం, అమీన్‌పూర్‌లోని రైతులు 27వేల 120మందికి రూ. 12కోట్ల 99లక్షల రైతు భరోసా నిధులు వేయలేదని తెలిపింది. నగరంతో పాటు రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల్లోని కొన్ని మండలాలు జీహెచ్ఎంసీలో ఉన్నాయని, పట్టణీకరణకు గురయ్యాయని, వ్యవసాయం చేయడంలేదని చెబుతూ ప్రభుత్వం పటాన్‌చెరు డివిజన్‌లోని రైతుల అకౌంట్లలో డబ్బులు వేయలేదు.

హరీశ్‌రావు హెచ్చరికలతో ప్రకంపనలు

మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు సంగారెడ్డి జిల్లా జిన్నారంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, రైతులతో నిర్వహించిన మహాధర్నాలో పాల్గొని ప్రభుత్వాన్ని నిలదీశారు. నగరం, నగర శివారులోని రైతులు ఏమి అన్యాయం చేశారని ప్రశ్నించారు. ప్రభుత్వం రైతు భరోసా డబ్బులు వేయని పక్షంలో 20వేల మంది రైతులతో రింగురోడ్డుపై ఆందోళన చేస్తామని హెచ్చరిండంతో సర్కారు దిగి వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం రైతుల అకౌంట్లలో డబ్బులు జమ చేసింది.

మున్సిపాలిటీలుగా ఇంద్రేశం, జిన్నారం

సంగారెడ్డి జిల్లా ఇంద్రేశం గ్రామ పంచాయతీ కార్యాలయం

- మంత్రి మండలి ఆమోదం
- ఇస్నాపూర్ మున్సిపాలిటీ అప్‌గ్రేడ్
- పటాన్‌చెరు మండల పరిషత్ కనుమరుగు...?
- జాతీయ ఉపాధి హామీ పథకానికి కూలీలు దూరం..?
- జిన్నారం మండలంలో గడ్డపోతారం,జిన్నారం, పటాన్‌చెరు మండలంలో ఇస్నాపూర్, ఇంద్రేశం మున్సిపాలిటీలు

పటాన్‌చెరు, జూన్ 24 : సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గంలో ఉన్న ఇంద్రేశం, జిన్నారం గ్రామాలను మున్సిపాలిటీలుగా ఏర్పాటు చేస్తూ మంత్రి మండలి ఆమోదం తెలిపింది. ఓఆర్ఆర్‌కు సమీపంలో ఉండడంతో పాటు ఇప్పటికే హెచ్ఎండీఏ పరిధిలో పటాన్‌చెరు, జిన్నారం మండలాలు ఉన్నాయి. పటాన్‌చెరు మండలంలో ఉన్న ఇంద్రేశం ఇప్పటికే పట్టణంగా అభివృద్ధి చెందింది. జనాభా పెరగడంతో ప్రజలకు మౌలిక సదుపాయాలు కలిపించేందుకు కొత్తగా రెండు మున్సిపాలిటీలు ఏర్పాటు చేయడంతోపాటు ఇస్నాపూర్ మున్సిపాలిటీని అప్‌గ్రేడ్ చేస్తూ మంత్రి మండలి ఆమోదించింది. కొత్తగా కాలనీలు ఏర్పాటు కావడం..ప్రజలకు సౌకర్యాలు కలిపించడంలో పంచాయతీలు విఫలమయ్యాయి. దీంతో ప్రజలకు మెరుగైన పాలన అందించేందుకు మున్సిపాలిటీలు ఏర్పాటు చేస్తున్నారు. పటాన్‌చెరు మండల పరిషత్ కార్యాలయం పరిధిలో ఉన్న గ్రామాలు తెల్లాపూర్, ఇస్నాపూర్, ఇంద్రేశం మున్సిపాలిటీలో విలీనం కావడంతో మండల పరిషత్ కార్యాలయం ఎత్తివేస్తారని అధికారులు తెలిపారు. నియోజకవర్గంలో ఉన్న అమీన్‌పూర్, పటాన్‌చెరు మండల పరిషత్ కార్యాలయాలు కనుమరుగు కానున్నాయి. గ్రామాలను మున్సిపాలిటీలో విలీనం చేయడంతో జాతీయ ఉపాధి హామీ పథకం అమలుకాదు. దీంతో పేదకూలీలు ఉపాధి పనులకు దూరంకానున్నారు.

మున్సిపాలిటీగా ఇంద్రేశం

ఇంద్రేశాన్ని మున్సిపాలిటీగా ఏర్పాటు చేస్తున్నట్లు సోమవారం మంత్రిమండలి ప్రకటించింది. ఇంద్రేశం మున్సిపాలిటీ పరిధిలో ఐనోల్, బచ్చుగూడ, రామేశ్వరంబండ, చిన్నకంజర్ల, పెద్ద కంజర్ల గ్రామ పంచాయతీలను విలీనం చేయనున్నారు. ఇంద్రేశం మున్సిపాలిటీ పరిధిలో సుమారు 25వేలకు పైగా ఓటర్లు ఉంటారని అధికారులు తెలిపారు.

ఇస్నాపూర్ మున్సిపాలిటీ అప్‌గ్రేడ్ చేస్తూ ఆమోదం

ఇస్నాపూర్ మున్సిపాలిటీని అప్‌గ్రేడ్ చేస్తూ మంత్రి మండలి ఆమోదించింది. పటాన్‌చెరు మండలంలో ఉన్న రుద్రారం, లక్డారం, భానూర్, నందిగాం, క్యాపారం గ్రామాలను ఇస్నాపూర్ మున్సిపాలిటీలో విలీనం చేసి అప్ గ్రేడ్ చేసేందుకు ఆమోదించారు. ఇస్నాపూర్ మున్సిపాలిటీలో 40 వేలకు పైగా ఓటర్లు ఉంటారని అధికారులు వివరించారు.

పారిశ్రామికంగా ఇస్నాపూర్ అభివృద్ధి

రాష్ట్రంలోనే సంగారెడ్డి జిల్లాలోని ఇస్నాపూర్ పారిశ్రామికంగా అభివృద్ధి చెందింది. మున్సిపాలిటీ పరిధిలో ఉన్న పాశమైలారం పారిశ్రామికవాడకు దేశంలో గుర్తింపు ఉంది. ఈ పారిశ్రామికవాడలో దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన కార్మికులు పనిచేస్తారు. ఈ ప్రాంతాన్ని మినీ ఇండియాగా పిలుస్తారు. కొందరు ఇక్కడ ఇండ్లు నిర్మాణం చేసుకొని ఉంటున్నారు. పాశమైలారం పారిశ్రామికవాడలో పలు రకాల పరిశ్రమలు ఉన్నాయి. ఇక్కడ ఉత్పత్తి చేసిన వస్తువులు విదేశాలకు, దేశంలోని పలు రాష్ట్రాలకు ఎగుమతి చేస్తారు.

జిన్నారం మున్సిపాలిటీ పరిధిలో విలీనం చేసే గ్రామాలు

జిన్నారం గ్రామాన్ని కొత్తగా మున్సిపాలిటీ చేయనుండగా నలతూర్, శివానగర్, సోలకపల్లి, ఊట్ల , జంగంపేట , కొడకంచి , రాళ్లకత్వ, అండూర్, మంగంపేట విలీనం కానున్నాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం 15252 మంది ఉండగా ప్రసుత్తం 17956 జనాభా ఉందని అధికారులు తెలిపారు. ఇప్పటికే ప్రభుత్వం జిన్నారం మండలంలో ఉన్న కొన్ని గ్రామాలను గడ్డపోతారం మున్సిపాలిటీలో విలీనం చేసింది.

సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్‌లో ప్రధాన రోడ్డు ప్రక్కన పేరుకుపోయిన చెత్తాచెదారం

పల్లెల్లో తాండవిస్తున్న సమస్యలు.. తీవ్రమవుతున్న తాగునీటి సమస్య

- పల్లెలకు నిధులు విడుదల చేయని ప్రభుత్వం
- శిక్షలేమో పంచాయతీ కార్యదర్శులకు
- కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై భగ్గుమంటున్న జనం
- అప్పులు చేసి గ్రామాల్లో ప్రాథమిక సమస్యలు పరిష్కరిస్తున్న కార్యదర్శులు
- ప్రభుత్వం నిధులివ్వడం లేదంటే చర్యలకు దిగుతున్న ఉన్నతాధికారులు
- డీజిల్‌కు పైసలు లేక పలు గ్రామాల్లో మూలనపడ్డ జీపీ ట్రాక్టర్లు

ఎక్కడి సమస్యలు అక్కడే..

సంగారెడ్డి జిల్లా కంది మండలంలోని చెర్యాల్‌లో పేరుకుపోయిన చెత్తాచెదారం

మెదక్ జిల్లా నర్సాపూర్ మండలంలోని బ్రాహ్మణపల్లిలో డీజిల్ లేక నిరుపయోగంగా గ్రామపంచాయతీ ట్రాక్టర్

సిద్దిపేట,జూన్ 24 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు పూర్తవుతున్నా గ్రామాలకు రూపాయి నిధులు ఇవ్వలేదు.ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతున్నది.పేరుకు ప్రత్యేకాధికారుల మాటే కానీ వారు గ్రామాల వైపు తొంగిచూసిన దాఖలాలు లేవు. భారంమొత్తం పంచాయతీ కార్యదర్శులపైనే పడుతుంది.ప్రభుత్వం నిధులు ఇవ్వడం లేదు. తాము ట్రాక్టర్లలో డీజిల్ కూడా పోయలేం..ఆభారం మా వల్ల కాదు అని చాలా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు ట్రాక్టర్ల తాళాలు ఉన్నతాధికారులకు అందిస్తున్న విషయం తెలిసిందే. నిధుల మాట ఎత్తితే చాలు ఆకార్యదర్శిపై ఉన్నతాధికారుల వేధింపులు తప్పడం లేదు.మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం చిప్పల్‌తుర్తి గ్రామ పంచాయతీ కార్యదర్శి డీజిల్ లేక 20 రోజులుగా చెత్త తీయడం లేదు అన్నందుకు ఏకంగా కలెక్టర్ ఆపంచాయతీ కార్యదర్శికి షోకాజు నోటీసులు జారీ చేశారు. దీంతో ఉమ్మడి జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులు మండిపడుతున్నారు. నిధులు ఇవ్వరు తాము సమస్యలు పరిష్కరించమంటే ఎలా సాధ్యం అంటు వాపోతున్నారు. ఒక్కో పంచాయతీ కార్యదర్శి లక్షల్లో ఖర్చు చేశారు.ఇంత చేసినా తమకు గుర్తింపు లేదని మండిపడుతున్నారు.

పల్లెల అభివృద్ధికి కేసీఆర్ ప్రభుత్వం కృషి

కేసీఆర్ ప్రభుత్వం పల్లెప్రగతి ద్వారా నిధులను నేరుగా గ్రామాలకు విడుదల చేసింది. ఇంటింటా చెత్త సేకరణకు ప్రతి గ్రామానికి ఒక ట్రాక్టర్ ఇచ్చింది. ఉమ్మడి మెదక్ జిల్లాలోని సిద్దిపేట జిల్లాలో 508 గ్రామ పంచాయతీలకు 494 ట్రాక్టర్లు ఉన్నాయి. 477 మంది పంచాయతీ కార్యదర్శులు పని చేస్తున్నారు. మెదక్ జిల్లాలో 492 గ్రామ పంచాయతీల్లో 469 ట్రాక్టర్లు ఉండగా 468 పంచాయతీ కార్యదర్శులు పని చేస్తున్నారు. సంగారెడ్డి జిల్లాలో 647 (ప్రస్తుతం 620) గ్రామ పంచాయతీల్లో 636 ట్రాక్టర్లు ఉండగా అన్ని గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు పనిచేస్తున్నారు. గ్రామాలు ఆరోగ్య గ్రామాలుగా తీర్చిదిద్దబడ్డాయి. పలు గ్రామాలు జాతీయ స్థాయిలో అవార్డులను సైతం సొంతం చేసుకున్నాయి. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితి మారిపోయింది. గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడింది. పారిశుధ్యం లోపించింది. గ్రామాల్లో తాగునీటి సమస్య జఠిలంగా మారింది. 18 నెలలుగా గ్రామాలకు నిధులు రావడం లేదు.గ్రామాల్లో ఎక్కడి పనులు అక్కడే ఉన్నాయి. పంచాయతీల పాలక వర్గం గడువు 2024 ఫిబ్రవరిలో పూర్తి అయ్యింది. గడువు ముగియగానే గ్రామాలకు ప్రత్యేకాధికారులను నియమించారు.వీరిని నియమించినా భారం మొత్తం పంచాయతీ కార్యదర్శుల మీదనే పడుతుంది.గ్రామాలకు నియమించిన ప్రత్యేకాధికారుల పర్యవేక్షణ లేదు. సరైన పర్యవేక్షణ లేక గ్రామాలు అధ్వానంగా తయారయ్యాయి.

పల్లెల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం

సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాలోని గ్రామాల్లో పారిశుధ్యం పడకేసింది. ఇదివరకు చేసిన బిల్లులు రాకపోవడంతో పాటు కొత్త పనులు పూర్తికాలేదు. దీంతో గ్రామాల్లో 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే' అన్నట్లుగా తయారైంది. గ్రామాల్లో చిన్న చిన్న పనులు సైతం జరగడం లేదు. ప్రధానంగా గ్రామాల్లో విద్యుత్, తాగునీరు, పారిశుధ్యం సమస్యలు నెలకొన్నాయి. పారిశ్రామిక ప్రాంతాలు ఉన్న గ్రామాల్లో కొంత ఆదాయం వచ్చినా వాటిని వినియోగించకుండా ప్రభుత్వం వాటిపై ప్రిజింగ్ విధించింది. దీంతో ఏంచేయాలో అర్థం కాని పరిస్థితుల్లో అధికారులు ఉన్నారు. ఆదాయ వనరులు ఉన్న పంచాయతీల్లోనే జీతాలు చెల్లించలేని పరిస్థితి ఉంటే, ఆదాయం లేని గ్రామాల పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.గ్రామాల్లో పనిచేసే పారిశుధ్య కార్మికులకు నెలల తరబడి జీతాలు రావడం లేదు.

సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్ మండలంలోని పెద్ద ముబారక్‌పూర్‌లో మూలనపడ్డ ట్రాక్టర్

కేసీఆర్ ప్రభుత్వంలో నెల నెలా నిధులు

కేసీఆర్ ప్రభుత్వ హయాంలో పల్లెప్రగతి నిధులు ప్రతినెలా విడుదల చేసింది.ఉమ్మడి మెదక్ జిల్లాలోని అన్ని గ్రామాలు పల్లె ప్రగతి ద్వారా అద్భుత ప్రగతి సాధించాయి. ఉమ్మడి జిల్లాకు సుమారు నెలకు రూ.30 కోట్లపైచిలుకు నిధులు వచ్చాయి. ఇవి కాకుండా గ్రామాల్లో పన్నుల ద్వారా ఇతరత్రా ఆదాయం వస్తే అద్భుతంగా తీర్చిదిద్దారు. పల్లె ప్రగతి కింద విస్తృతంగా పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. ప్రతి గ్రామానికి డంపింగ్ యార్డు, హరితహారంలో విరివిగా మొక్కలు నాటించారు. ప్రతి గ్రామ పంచాయతీకి ట్రాక్టర్ కొన్నిచ్చారు. తాగునీటి సమస్య లేకుండా ప్రతి ఇంటికి నల్లా ద్వారా మిషన్ భగీరథ నీటిని సరఫరా చేశారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు విడుదల చేయక గ్రామ పంచాయతీల అభివృద్ధి కుంటుపడింది.

సిద్దిపేట జిల్లా మద్దూరు ఎంపీవోకు గ్రామ పంచాయతీ ట్రాక్టర్ల తాళం చెవులను అప్పగిస్తున్న పంచాయతీ కార్యదర్శులు (ఫైల్)

సిద్దిపేటలో నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

ప్రతినెలా సివిల్ రైట్స్ డే నిర్వహించాలి

ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

సిద్దిపేట, జూన్ 24: ప్రతినెలా సివిల్ రైట్స్ డే నిర్వహించాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అధికారులకు సూచించారు. ఎస్సీ, ఎస్టీల సమస్యలు పరిష్కరించడంతో పాటు చట్టాలు, సంక్షేమ పథకాల గురించి అధికారులు సంపూర్ణ అవగాహన కల్పించాలన్నారు. మంగళవారం సిద్దిపేటలోని ఐడీహెచ్ఎస్‌లోని సమావేశ మందిరంలో ఎస్సీ, ఎస్టీ ల్యాండ్ ,అట్రాసిటీ కేసులపై సిద్దిపేట కలెక్టర్ కె. హైమావతి, సీపీ అనురాధ, ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు కొంకటి లక్ష్మీనారాయణ, రాంబా బునాయక్, లీలాదేవి, జిల్లా శంకర్, రెణికుంట్ల ప్రవీణ్, ఎస్సీ, ఎస్టీ సంఘాల సభ్యులతో కలిసి ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లాలో నమోదైన కేసులకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకోవడంతో పాటు అవసరమైన కేసుల వివరాల నివేదిక అందించాలని పోలీస్ అధికారులను కోరారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై నెలాఖరులోగా పెండింగ్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన కేసులు పరిష్కరించాలన్నారు. ప్రతినెలా చివరి వారంలో సివిల్ రైట్స్ డే,ప్రతి మూడు నెలలకు ఒకసారి డీవీఎంసీ సమావేశం నిర్వహించాలన్నారు. జిల్లాలో డీవీఎంసీ కొత్త సభ్యుల ఎన్నిక గురించి జిల్లా ఇన్‌చార్జి మంత్రి గడ్డం వివేక్ దృష్టికి తీసుకువెళ్లి అతి త్వరలో సభ్యుల ఎన్నికకు సంబంధించి కలెక్టర్ ద్వారా ఆదేశాలు జారీ చేయిస్తామన్నారు. జిల్లాలో బెస్ట్‌అవైలబుల్ స్కూళ్లకు సంబంధించి నిధుల అమలులో జాప్యం లేకుండా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానన్నారు. జిల్లాలో టెన్త్‌లో 91.92 శాతం ఉత్తీర్ణత సాధించినందుకు డీఈవోశ్రీనివాస్‌రెడ్డి, టీచర్లను ఆయన అభినందించారు. సిద్దిపేటలో బంజారా భవన్ కోసం ఈనెలాఖరు లోగా అనువైన స్థలాన్ని గుర్తించి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారుల వివరాలు కమిషన్‌కు అందజేయాలని ఆదేశించారు. సమీక్షలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి, అదనపు కలెక్టర్లు గరిమాఅగర్వాల్, అబ్దుల్ హమీద్, ఆర్డీవోలు, డీఎస్పీలు, ఆయాశాఖల అధికారులు ఎస్సీ, ఎస్టీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

పోలీసుల ప్రతిభను వెలికితీసేందుకే డ్యూటీ మీట్

సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్

సంగారెడ్డి, జూన్ 24: జిల్లా స్థాయిలో పోలీసు అధికారులు, సిబ్బందిలో దాగిఉన్న ప్రతిభను వెలికితీసేందుకే డ్యూటీ మీట్ నిర్వహించామని సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు. మంగళవారం సంగారెడ్డి జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా స్థాయి రెండో డ్యూటీ మీట్ ముగింపు సందర్భంగా ఆర్మూడ్ రిజర్వ్ డాగ్ స్క్వాడ్, బాంబ్ డిస్పోజల్ టీమ్ పనితీరును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీసు జాగిలాల నుంచి ఎస్పీ గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ బాంబు డిస్పోజల్ టీం వీఐపీలు వెళ్లే రోడ్డు మార్గాలు, మీటింగ్ ప్రదేశాలను ఏవిధంగా సర్చ్ చేసి రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటారన్నారు. లోతుగా పరీక్షలు చేసేందుకు మెటల్ డిటెక్టర్‌తో భూమి లోపల పాతిపెట్టిన మందుగుండు సామగ్రిని నివృత్తి చేస్తారన్నారు. ప్రవేశ ద్వారాల వద్ద ఏర్పాటు చేసే డోర్ ఫ్రేమ్ మెటల్ డిటెక్టర్ల వివరాలు సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ నరేందర్, అడ్మిన్ ఆర్ఐ రామారావ్, ఆర్ఐ రాజశేఖర్‌రెడ్డి, డానియేల్, డాగ్ హ్యాండ్లర్స్ జగదీశ్వర్, మొగులయ్య, అంజయ్య, విశ్వనాథ్, హనుమంతు, బాంబ్ డిస్పోజల్ టీమ్స్ నుంచి హరిసింగ్, జియా, ఇమ్రాన్, నారాయణరావ్, షఫీ, సిబ్బంది పాల్గొన్నారు.